

చారకొండలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న కార్మికులు

### కేసీఆర్ హయాంలోనే బాగుండె..



విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్డు పెట్టమంటున్నరు. ఐదు నెలల నుంచి బిల్లులు ఇస్తలేరు. వంట చేయడానికి కూరగాయాలు, సరుకులు అప్పులు చేసి కొంటున్నాం. కేసీఆర్ సర్కారులో ప్రతి నెలా బిల్లులు వచ్చేవి. ఇప్పుడు పెరిగిన ధరలకు రోజు కూలీ కనీసం రూ.100 కూడా వొస్తలేదు. నెలలుగా బిల్లులు ఇయ్యకుంటే వంటలు ఎట్ల చేయాలే. పెరిగిన రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలి.

*- రాములమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, చారకొండ*

### సర్కారుకు మా బాధలు పట్టవా?



వంట బిల్లులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మేము పస్తులున్నా సరే విద్యార్థుల కడుపులు మాడొద్దని బయట అప్పులు తెచ్చి వంట చేస్తున్నాం. వడ్డీలు పెరుగుతున్నాయి. అయినా సర్కారు మా బాధ పట్టించుకుంటలేదు. వేలకు వేలు అప్పులు తెచ్చి వంట చేస్తుంటే కొన్ని నెలల నుంచి బిల్లులు ఇస్తలేరు. మా ఇంట్లో ఎలా గడుస్తదనే విషయాన్ని కాంగ్రెసోళ్లు ఆలోచించాలి. నెల నెలా బిల్లులు ఇచ్చేటట్లు సర్కారు చర్యలు తీసుకోవాలే.

*- రాజమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, మక్తల్*



వంట చేస్తున్న సిబ్బంది

## ఐదు నెలల బిల్లులు పెండింగ్‌లోనే..

- అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం వండుతున్నాం : కాంట్రాక్టర్ల ఆవేదన

గద్వాల టౌన్, జూలై 10 : ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం.. గుడ్డు బిల్లుల చెల్లింపులు లేదు.. నాణ్యత లోపించిన బియ్యం పంపిణీ.. ఇలా ఇవన్నీ చూస్తుంటే మధ్యాహ్న భోజన పథకం కష్టమేనని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లుల చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురువుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వడ్డీకి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల కేసీఆర్ సర్కారులో ఎప్పుడూ బిల్లులు పెండింగ్‌లో పెట్టలేదని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులను చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

### ప్రతి నెలా ఇబ్బ ందిగా ఉంది..



ఐదు నెలలుగా బిల్లుల చెల్లింపు లేదు. ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం గుడ్ల బిల్లులు కూడా చెల్లించడం లేదు. జీతాలు ఇచ్చేందుకు, సరుకులు కొనేందుకు వడ్డీకి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. కొన్ని నెలలుగా లావు బియ్యం పంపిణీ చేస్తున్నారు. అన్నం సరిగా ఉడకడం లేదు. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి.

*- రాజు, కాంట్రాక్టర్, గద్వాల*



దామరగిద్ద జీపీఎస్ పాత పాఠశాల భవనం ఎదుట ఆరుబయట కూర్చున్న విద్యార్థులు

## కొత్త భవనమున్నా.. ఆరుబయటే విద్యార్థులు

దామరగిద్ద, జూలై 10 : మండల కేంద్రంలో జీపీఎస్ పాఠశాల నూతన భవనం కట్టినా ఆరుబయటే విద్యార్థుల చదువు కొనసాగుతోంది. మూడు వారాల కిందట స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించినప్పటికీ విద్యార్థులను మాత్రం ప్రైవేట్ భవనంలో ఆరుబయట కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. వర్షాకాలంలో విద్యార్థులను బయట కూర్చోబెట్టి ఆరోగ్యాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషపురుగుల బారిన పడితే ఎవరు బాధ్యులవుతారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి మండల విద్యాధికారి గోపాల్‌నాయక్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా.. మరుగుదొడ్లు, వంటగది లేనందునా పాత బిల్డింగ్‌లో కొనసాగిస్తున్నామని చెబుతున్నారు.

### టీచర్లు లేకుంటే చదువులెట్ల..



సర్కారు బడుల్లో పిల్లలకు సరిపడా టీచర్లు లేకపోతే చదువులు ఎవరు చెప్పాలె. మా గ్రామంలో ఉన్న బడిలో 148 మంది పిల్లలు చదువుతున్నారు. ఒక స్కూల్ అసిస్టెంట్, ఆరుగురు ఎస్జీటీ టీచర్లు ఉండాల్సి ఉండగా.. ఒక స్కూల్ అసిస్టెంట్, ఒక ఎస్జీటీ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వెంటనే భర్తీ చేసి విద్యార్థుల చదువులు సక్కగా సాగేందుకు సర్కారు చర్యలు తీసుకోవాలి. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి.

*- ఆంజనేయులు, కొత్తపల్లి, అయిజ మండలం, జోగుళాంబ గద్వాల*

# బడులు వెతలు

- సర్కారు స్కూళ్లల్లో వసతులు కరువు
- విద్యార్థులున్నా సరిపడా ఉపాధ్యాయులు లేరు
- ఫుల్‌గా నిధులున్నా.. పనులు నిల్
- నత్తనడకన 'అమ్మ ఆదర్శ' పనులు
- పలుచోట్ల వరండాలోనే చదువులు
- అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- పట్టించుకోని రేవంత్ సర్కారు

ఫీల్డ్ స్టోరీ

## వంట ఏజెన్సీల ఆవేదన

- ఏడు నెలల బిల్లుల రాక ఇబ్బందులు

మక్తల్, జూలై 10 : పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు తీసుకొచ్చిన మధ్యాహ్న భోజన పథకాన్ని కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. ఏడు నెలల నుంచి వంట బిల్లులు, గుడ్ల బిల్లులు రాక కార్మికులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలకు వేలు అప్పులు తెచ్చి విద్యార్థులకు వంట చేస్తున్నామని, నెలల తరబడి పెండింగ్ పెడితే ఎలాగని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మక్తల్ మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు, 13 ప్రాథమికోన్నత, 37 మండల ప్రజా పరిషత్ పాఠశాలల్లో 7,656 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉండగా, పెరిగిన ధరలతో వంట కార్మికులు, ఏజెన్సీలు అనేక తంటాలు పడుతున్నారు. దీనికి తోడు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు పెరిగి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మక్తల్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్న మహిళలు

### పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలి..



కేసీఆర్ సర్కారు హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయి. అయితే, కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత ఏడు నెలలుగా పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సరైన మెయింటనెన్స్ లేదు. పారిశుధ్య కార్మికులు లేక మురుగుదొడ్లు, పాఠశాల గదులు అపరిశుభ్రంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులను నియమించాలి.

*- దేవర గోపాల్, ఎస్ఎంసీ మాజీ మెంబర్, అయిజ*

### కార్మికుల వేతనం పెంచాలి..



పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజనం వండాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. సర్కారు నెలలుగా బిల్లులు ఇయ్యకపోవడంతో శానా ఇబ్బందులు పడుతున్నాం. కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం అందించి ఆదుకోవాలి.

*- పల్లవి, కార్మికురాలు, చాకలిగేరి, మక్తల్*

### మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం..

వంట ఏజెన్సీకి ఇబ్బందులెదురైనా విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతినెలా బిల్లులు వచ్చేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

*- అనీల్‌గౌడ్, జీహెచ్‌ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, మక్తల్*

## నిధులున్నా సాగని పనులు

- ఊట్కూరు పాఠశాలకు రూ.1.60 కోట్లు మంజూరు
- కేసీఆర్ సర్కారులోనే నిధుల కేటాయింపు
- ఏడు నెలలైనా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఊట్కూర్, జూలై 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 325 మంది, ఉర్దూ మీడియంలో 109 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేసీఆర్ సర్కారులో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల పునఃనిర్మాణం కోసం రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. నిజాం కాలంలో నిర్మించిన పురాతన గదులను తొలగించి కొత్తగా గదుల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా పనులను ప్రారంభించింది లేదు. అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు ముందుకు సాగకపోగా విద్యార్థులు ఇరుకు గదులు, వరండాల్లో కూర్చుని విద్యాభ్యాసం చేస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు పడుతున్నారు. మలమూత్ర విసర్జన కోసం ఆరుబయట, పెద్ద చెరువు సమీపంలోకి వెళ్తున్నారు.



వరండాలో కూర్చొని చదువుకుంటున్న ఊట్కూర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

### నోటికాడి కూడు లాక్కున్నారు..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారంతా పేద విద్యార్థులే ఉంటారు. అలాంటి వారు ఇబ్బందులు పడొద్దని కేసీఆర్ సారు పొద్దుగాల బ్రేక్‌ఫాస్ట్ పెడుతుండె. కాంగ్రెసోళ్లు వచ్చినంక పిల్లల నోటికాడి కూడు లాగేసుకునేలా ఆ పథకానికి మంగళం పాడింర్రు. పొద్దుగాల ఇండ్లకాడ వంట కాక పిల్లలంతా పస్తులతో బడికి వస్తున్నరు. మధ్యాహ్న భోజనం కూడా సరిగా పెడ్తలేరు. మెనూ ప్రకారం భోజనం పెడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాంగ్రెస్ సర్కారు స్పందించి ప్రభుత్వ బడుల్లో సమస్యలను పరిష్కరించాలి.

*- రంగన్న, విద్యార్థిని తండ్రి, మానవపాడు*

## ఏడు తరగతులు.. ఇద్దరు ఉపాధ్యాయులు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

మిడ్జిల్, జూలై 10 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేట్ పాఠశాలలు హంగులు ఆర్భాటాలతో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించుకునేందుకు పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులు లేక చాలా మంది సర్కారు బడికి వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. ఈ నేపథ్యంలో మండలంలోని బైరంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులకు 60మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. దీంతో ఒకే తరగతి గదిలో 2,3,4 తరగతులు బోధించే పరిస్థితి నెలకొన్నది. ఉపాధ్యాయులు లేకపోవడంతలో బడికి పంపేందుకు తల్లిదండ్రులు సుముఖత చూపడం లేదు. ఈ విషయమై హెచ్‌ఎం వినోద్‌కుమార్‌ను అడుగగా, బదిలీపై ముగ్గురు ఉపాధ్యాయులు పాఠశాలకు రావాల్సి ఉందని తెలిపారు.



ఒకే గదిలో చదువుకుంటున్న నాలుగు తరగతులకు చెందిన విద్యార్థులు

## అప్పులు తెచ్చి వంట చేస్తున్నాం..

మూడు నెలలుగా వంట బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. నెలకు రూ.60 వేల వరకు (కూరగాయలు, గుడ్లు, కంది పప్పు, ఇతర వస్తువుల కొనుగోలుకు) అవుతున్నాయి. విద్యార్థులు పస్తులుండొద్దని వడ్డీలకు అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ధరలు పెరగడంతో నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయాలి.

*- హుస్సేన్ బీ, జిల్లా పరిషత్ పాఠశాల, ఉండవెల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా*

### విద్యాశాఖకు మంత్రి ఎక్కడ?



కాంగ్రెస్ సర్కారులో ఆబ్కారీ శాఖకు మంత్రి ఉన్నాడు కానీ.. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యాశాఖకు మాత్రం మంత్రి లేడు. దీన్నిబట్టే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా విద్యాశాఖను పట్టించుకున్న పాపనపోలేదు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోవడంతో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. మధ్యాహ్న భోజన బిల్లులు ఇస్తలేరు. పారిశుధ్య పనులు లేవు. దుస్తులు ఒక జత మాత్రమే ఇచ్చింర్రు. విద్యావ్యవస్థపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు చేపడుతాం.

*- హాలీంపాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, గద్వాల*

## నడిగడ్డ నుంచే రైతుపోరు

- రైతుభరోసా లేక రైతన్న ఆందోళన
- ఏడు నెలల వడ్డీతో సహా రుణమాఫీ చెల్లించాలి
- శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్
- గట్టు, మల్దకల్ మండలాల్లో కార్యకర్తలు, రైతులతో సమావేశాలు



మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

గట్టు, జూలై 10 : కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని, రేవంత్ సర్కారుపై నడిగడ్డ నుంచే రైతుల పోరాటం ప్రారంభిస్తామని శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. వానకాలం సాగు ప్రారంభమై నెల కావస్తున్నా పెట్టుబడి సాయాన్ని అందించలేని దుస్థితిలో ఉన్నదన్నారు. గట్టు, మల్దకల్ మండలాల్లో బుధవారం ఆయన పర్యటించి కార్యకర్తలు, రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం గట్టులో విలేకరులతో మాట్లాడారు. ఏడు నెలల పాలనలో రూ.30 వేల కోట్ల అప్పు చేసిందని, అయినా రేవంత్‌సర్కారు రైతులకు మాత్రం ఖాళీ చేతులు చూపెడుతున్నదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు చూపుతున్న ప్రేమ.. రైతులపై పావు వంతైనా చూపించడం లేదని ఎద్దేవా చేశారు. కరెంట్ కోతలతో పదేండ్ల కిందటి పాత రోజులు చూపిస్తున్నదని, కాంగ్రెస్ సర్కారు పంటలకు పట్టిన చీడలా మారిందన్నారు. తక్షణమే రూ.2లక్షల రుణమాఫీ చేసి ఏడు నెలల వడ్డీతో కలిపి చెల్లించాలన్నారు. రాష్ట్ర రైతులోకం యావత్తు సర్కారు మోసంపై రగిలిపోతున్నదన్నారు. నడిగడ్డ నుంచే రేవంత్‌రెడ్డి సర్కారుపై రైతుపోరు షురూ అవుతున్నదని హెచ్చరించారు. పాలమూరు పర్యటనలో సైతం ఉమ్మడి జిల్లా రైతాంగం కోసం నిర్దిష్టమైన చర్యలు ప్రకటించకుండా, రొటీన్ రివ్యూ డ్రామా వేసి సీఎం వెళ్లిపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు బాసు హన్మంతునాయుడు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య, బస్వరాజు, హన్మంతురెడ్డి, మోనేశ్ మారోజ్, మల్లికార్జున్, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజునాయుడు, నాగరాజు, కిష్టప్ప, సత్యం, వీరేశ్, నూరుపాషా, నల్లారెడ్డి, మక్బూల్, వెంకటేశ్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

### అర్ధరూపాయి పని కూడా చేయలేదు..

మల్దకల్, జూలై 10 : కాంగ్రెస్ ఏడు నెలల్లో అర్ధరూపాయి పని కూడా చేయలేదని, అలాంటి పార్టీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామనడం హాస్యాస్పదమని ఆంజనేయగౌడ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్దకల్ మండలం కుర్తిరావులచెర్వులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లో చేరారన్నారు. గులాబీ పార్టీకి మూడు సింహాలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉండగా.. నాలుగో సింహమైన కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

## విద్యుత్ అంతరాయం లేదు

- సీఎం రేవంత్ ప్రసంగించే సమయంలో కోతలు లేవు
- విద్యుత్ శాఖ ఎస్ఈ వివరణ

మహబూబ్‌నగర్, జూలై 10 : సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతుండగా ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగలేదని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (టీజీఎస్‌పీడీసీఎల్– ఆపరేషన్స్ ) పీవీ రమేశ్ బుధవారం ప్రకటనలో వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉమ్మడి జిల్లా పార్టీ ము ఖ్య కార్యకర్తలతో భగీరథ కాలనీ సమీపంలోని ఏఎస్ఎన్ గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి స్పందించి ఆయన విద్యుత్‌శాఖ సిబ్బందితో పూర్తిస్థాయి వివరాలను సేకరించారు. సీఎం మాట్లాడుతుండగా ఎలాంటి అంతరాయం కలుగలేదని ప్రకటించారు.


మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇంజనీర్ మిత్రులందరికి తెలంగాణ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు | ADVT Special

తెలంగాణ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ,మిత్రులకు శ్రేయోభిలాషులకు, ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు, బిల్డర్స్‌కి మరియు మా కస్టమర్లకు "తెలంగాణ ఇంజనీర్స్ డే" శుభాకాంక్షలు. అభినందనలతో..
Chief Engineer & Secretary, P.W.D 1920 - 1937
Keerthi Builders
Vaastu Planners
MPL. Licenced structural Engineer
Cell: 9440415488
G. Sanjeev B.Tech. Civil
Off: 8-3-9/B, Mettugadda, Mahabubnagar - 509 002.

తెలంగాణ ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు
హైదరాబాద్ సంస్థానంలో అనేక భారీ మధ్యతరహా సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించిన శ్రీ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతిని తెలంగాణ ఇంజనీర్స్‌డే గా జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులందరికి జిల్లా ఇంజనీయర్లకు మా యొక్క 'ఇంజనీర్స్ డే' శుభాకాంక్షలు...
Chief Engineer & Secretary, P.W.D 1920 - 1937
Telangana Electricity Engineer's Association (TEEA) Nagarkurnool

తెలంగాణ ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు
హైదరాబాద్ సంస్థానంలో అనేక భారీ మధ్యతరహా సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించిన శ్రీ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతిని తెలంగాణ ఇంజనీర్స్‌డే గా జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులందరికి జిల్లా ఇంజనీయర్లకు మా యొక్క 'ఇంజనీర్స్ డే' శుభాకాంక్షలు...
Chief Engineer & Secretary, P.W.D 1920 - 1937
R&B కార్యాలయ సిబ్బంది
జోగుళాంబగద్వాల జిల్లా

తెలంగాణ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
శ్రీ నవాబ్ అలీ నవాజ్ జంగ్
Chief Engineer & Secretary, P.W.D 1920 - 1937
D.E.E, RWS & S
A.E.E, RWS & S